# అసలుదొంగ

కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు రవికాంత్ క్యాబిన్‌లోకి వెళ్లి సీట్లో కూర్చుని తన టేబుల్‌మీద కాగితాలు చూసుకున్నాడు. అన్నిటికన్నా పైన ఆ రోజు వర్కు షెడ్యూలు కాగితం ఉంచిందాయన సెక్రటరీ. ప్రొద్దుట 9.30 నుంచి 10గం॥ల దాకా విజిటర్స్‌కి, 12 గం॥లకి బోర్డు మీటింగు 4 గం॥లకు యూనియన్ ప్రెసిడెంటుతో మీటింగు, రాత్రి 8 గం॥లకు ఊర్లో పెద్ద హోటల్లో బిజినెస్ డీల్‌కి సంబంధించిన డిన్నరు. కాగితం చూస్తూనే ఆయన ఇంటర్‌కామ్‌లో సెక్రటరీ నడిగాడు.

"హోటల్లో రిజర్వేషన్ చేసావుగా"

"చేసాను సార్"

"ఎవరైనా విజిటర్సున్నారా?"

"ఎవరో ఆనందరావుట సార్. ఏమీ బిజినెస్సు పనిలా లేదు. అంతా మీతోనే మాట్లాడతానంటున్నాడు. ముందు అప్పాయింటుమెంటు కూడా లేదు" పంపడం ఇష్టం లేనట్లుగా అందామె.

అంత ప్రొద్దుటే వచ్చాడంటే ముఖ్యమైన పని ఉండవచ్చు. క్లయింటయినా, కాకపోయినా మర్యాద చేస్తే నష్టమేమిటి? లోపలికి పంపించమన్నాడు.

లోపలకు వచ్చినవాడికి పాతిక ముప్పయ్ మధ్యనుండవచ్చు వయస్సు వేషం చూస్తే మధ్యతరగతి మనిషిలా వున్నాడు. చేతిలో ఫైలు నర్థిఫికెట్లు పెట్టుకున్నదానిలా వుంది.

"ఎవడో ఉద్యోగార్థి నేను ఉద్యోగాలు రాశులు పోసుకున్నట్లుగా వస్తారు" విసుగ్గా అనుకున్నాడు రవికాంత్.

"ఏం కావాలి?" అడగబోయేది తెల్సినట్లే విసుగ్గా ఉంది గొంతుక.

"నమస్కారంసార్. నా పేరు ఆనందరావు సార్. ఇంటర్మీడియట్ ఫస్ట్‌క్లాసులో పాసయ్యానుసార్. ఇంజనీరింగులో సీటు వచ్చింది. ఫస్టుఇయర్ పూర్తవగానే మా నాన్నగారు పోయారు. ఆర్థిక ఇబ్బందులవల్ల చదువు ఆగిపోయింది. కొన్నాళ్ళు చిన్న చిన్న ఉద్యోగాలు చేసాను. ఇప్పుడు మా కుటుంబం నిలదొక్కుకుంది.

తిరిగి చదువుకోవాలనుంది సార్. ఏదో తమలాంటి పెద్దలు సహాయం చేస్తే..." చేతులు కట్టుకుని నిల్చున్నాడతను.

"ఏవీ నీ సర్టిఫికెట్లు?" బిజినెస్‌కి అలవాటైన రవికాంత్‌కి ముందే అన్నీ వెరిఫై చేయడం అలవాటు.

సర్టిఫికెట్లన్నీ టేబిల్‌మీద శ్రద్ధగా పెట్టాడతను. ఎస్.ఎస్.సి.లో, ఇంటర్మీడియట్‌లో చాలామంచి మార్కులున్నాయి. ఇంజనీరింగ్ కాలేజివాళ్ళిచ్చిన టిసి. ఉంది. ఎక్కడా మోసం చేసే విషయంతా లేదు.

"అయితే మొత్తం ఫీజు కట్టమంటావా?

"అంత మాటంటానా సార్. ఏదో తమ దయ. ఎంతుంటే అంత ఇవ్వండి సార్. తమలాంటి నలుగుర్ని ఆశ్రయించి తమ దయతో మొదలెడతాను సార్. ఆ తర్వాత ఏచిన్న పార్ట్‌టైం జాబ్ చేసుకునో, లేదా ట్యూషన్లు చెప్పుకునో పూర్తి చేస్తానుసార్."

రవికాంత్ ఆలోచనలో పడ్డాడు. నిజమే తన తండ్రి తనను చదివించగలిగాడు. తనీనాడు పెద్ద ఉద్యోగంలో వున్నాడు. కష్టపడి పైకివచ్చేవాళ్ళకి చేయూత నివ్వాలి. పర్సులోంచి అయిదు వంద రూపాయల నోట్లిస్తూ "బాగా చదువుకో" అన్నాడు. ఆనందరావు చెప్పబోయే థాంక్సుకి చేత్తోటే వద్దని ఇక వెళ్ళచ్చన్నట్లు చూసాడు. కాండక్ట్ సర్టిఫికెట్ లేదన్నది కంపెనీ ఎమ్.డి.గారు గమనించలేదు.

❖ ❖ ❖

ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ సెంటరు కోలాహలంగా ఉంది. మధ్యాహ్నం సెషన్ ఇంకా ప్రారంభం కాలేదు. లెక్చరర్లు కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆనందరావు విడిగా కూచున్న అతని దగ్గరకు వెళ్ళి వినయంగా 'సార్' అన్నాడు సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు.

"నా పేరు ఆనందరావు సార్. ఇంజనీరింగ్ ఫస్టియర్ అవుతుండగానే మా నాన్నగారు పోయారు. కుటుంబాన్ని ఓ దారిలో పెట్టేసరికి ఇన్నాళ్ళయింది. మళ్ళీ చదువుకోవాలనుకుంటున్నాను. తమ లాంటి విద్యావేత్తలు పూనుకుని సహాయం చేస్తే..." చేతులు నులుముకుంటూ అన్నాడు.

సుబ్బారావుకి మనస్సులో జాలి పుట్టుకొచ్చింది. తనలాంటివాడేనన్న భావమూ కలిగింది. ఇంజనీరింగులో సీటొచ్చినా హాస్టల్‌లో వేరే ఊళ్లో ఉంచి చదివించే స్తోమత తన తండ్రికి లేకపోయింది. అందుకే ఊళ్లో ఎమ్.ఏ. చదివి జూనియర్‌కాలేజి లెక్చరర్ మాత్రం అవగలిగాడు. ఒకళ్లకి సాయం చేస్తే ఆ పుణ్యం తనని కాపాడుతుంది. కానీ తనెంత సాయం చెయ్యగలడు.

ఆమాటే అన్నాడు ఆనందరావుతో. "నేనిచ్చే దాంతో చదువు పూర్తవుతుందా?"

"మీతోటి వాళ్లక్కూడా చెప్తే..."

సుబ్బారావు చుట్టూ వున్న లెక్చరర్లకి కూడా సంగతి చెప్పి సాయం చెయ్యమన్నాడు

వాళ్లలో జాగ్రత్తపరులు ఆనంధరావును రుజువు అడిగారు. ఆనందరావు సర్టిఫికెట్లు చూపించాడు. అందరూ తలోపాతికా పదీ వాళ్ల ఇష్టాన్ని బట్టీ ఇచ్చారు. ఇంకో అయిదువందల రూపాయలతో బయటకు నడిచాడు ఆనందరావు.

❖ ❖ ❖

త్రి--స్టార్ హోటల్లో బిజినెస్ డిన్నర్ ఇస్తున్నాడు రవికాంత్. మాటలన్నీ వ్యాపార విషయాలమీదే సాగుతున్నాయి. రవికాంత్ అందరికీ సర్వీస్ ఎలా ఉంది అన్నది కూడా చూసుకుంటున్నాడు. చాలా ముఖ్యమైన డీల్ ఆ రాత్రి సెటిల్ కావలసివుంది. సడన్‌గా దూరంగా ఉన్న టేబిల్‌లో ఉన్న ఎరప్రర్టు వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు ఆయన.

"బేరర్, ఆ చివర టేబిల్లో ఉన్న ఎర్రషర్టు అతను ఇక్కడకు ఎక్కువగా వస్తాడా?"

రవికాంత్ హోదా, ఆ హోటలుకి పోషకుడు అన్న సంగతీ బేరర్‌కి బాగా తెలుసు. వినయంగా జవాబు చెప్పాడు.

"వాడిది మాయింటి దగ్గరే సార్. తండ్రి ఇంజనీర్ని చేద్దామని అనుకున్నాడు. వీడికి లేని దురలవాటు లేదు. కాలేజిలో డిబార్ చేసారు. తండ్రి గుండాగి చచ్చిపోయాడు. తల్లి వంటలు చేసి వీణ్ణి పోషిస్తోంది. ఎలా సంపాదిస్తాడో కానీ మజా చేసుకుందుకు మాత్రం సంపాదిస్తాడు. ఇలా తగలేస్తాడు."

ఎలా సంపాదిస్తాడో రవికాంత్‌కి తెలుసు. పైకి మాత్రం మనస్సులో భావాలు కన్పించనివ్వకుండా వ్యాపార విషయాలు మాట్లాడసాగాడు.

❖ ❖ ❖

తలుపు తీసిన పల్లవి భర్త రవికాంత్ మొహం చూసి ఆశ్చర్యపోయింది. మొహం బాగా వాడిపోయినట్లుంది. అనుకున్న బిజినెస్ డీల్ సెటిలయి ఉండదు. కానీ వ్యాపారంలో హెచ్చుతగ్గులకు ఇంతగా చలించరే. ఏమై ఉంటుందబ్బా. ఆయనే చెప్తారులే. కష్టసుఖాలు కల్సి పంచుకోవడం తమ దాంపత్యంలో ఎప్పుడూ ఉంది కదా.

డ్రెస్ మార్చుకుంటూ అన్నాడు. "ఈవేళో వింత జరిగింది"

"ఏమిటి?"

ఆనందరావు విషయం చెప్పాడు రవికాంత్.

"అరె అంత మోసం చేస్తే ఊరుకున్నారా? పోలీసు కంప్లయింట్ ఇవ్వలేదా?"

"ఏమని ఇవ్వను? మోసానికి మన దగ్గర రుజువేముంది? అంతేకాక ఇలా చిన్న విషయంలో కూడా మోసపోయామని బిజినెస్ సర్కిల్‌లో తెలిస్తే వ్యాపారం కూడా దెబ్బతింటుంది."

భార్యకు విషయం చెప్పి తేలికైన మనస్సుతో రవికాంత్ నిద్రపోయాడు. పల్లవికి నిద్రపట్టలేదు. ఇలా వదిలేస్తే ఈ మోసగాళ్ళు ఇంకోళ్ళనీ, ఇంకోళ్లను మోసగిస్తూనే ఉంటారు. కొంతమందినైనా తప్పించగలగాలి. ఏం చెయ్యాలి. ఆమె ఆలోచనలు ఒక రూపం దాల్చాయి. ఆమె లేచి టైపు రైటరు ముందు కూచుంది.

రెండు నెలలకు ఒక ప్రముఖ ఇంగ్లీషు పత్రికలో ఆనందరావు మోసం కథావస్తువుగా వ్రాసిన కథ ప్రచురితమైంది.

❖ ❖ ❖

సెకండ్ షో సినిమా చూసి వస్తున్న సుబ్బారావు ఆశ్చర్యపోయాడు ఎదురుగా రోడ్డు దాటుతున్న వ్యక్తిని చేసి, బీదవాడినని డబ్బు తీసుకున్నాడు అంత పెద్ద హోటల్లో నుంచి ఎలా వస్తున్నట్లు? బహుశా అక్కడ ఏదైనా చిన్న పని చేస్తున్నాడేమో. స్నేహితుడి మీద చెయ్యివేసి తూలుతున్నట్లుగా ఉన్నాడే. సుబ్బారావు వాళ్ల వెనకాలనే నడవసాగాడు. రోడ్డు నిర్మానుష్యంగా ఉండడంవల్ల మాటలు బాగా వినబడుతున్నాయి.

"రెండు కేసులు దొరికాయి ఈ వేళ, కంపెనీ ఎమ్.డి.గారు అయిదిచ్చాడు. స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లో ఓ వెర్రి మాలోకం దొరికాడు. అందరి చేతా కూడా ఇప్పించాడు' ఆనందరావు గర్వంగా అంటున్నాడు.

సుబ్బారావు మనస్సు కుతకుతలాడిపోయింది.

"ఎన్నాళ్లిలా మోసం చెయ్యగలవు?" మిత్రుడి కుతూహలం.

"ఇదేమైనా చిన్న ఊరా? అయినా అంతా తెలుకుట్టిన దొంగల్లా ఉంటారులే. పైకి చెప్పరు కదా. పావం మా నాన్న నేను ఇంజనీర్నయి సంపాదించాలనుకున్నాడు. అవకుండానే బోల్డు సంపాదిస్తున్నాహోయిగా. అమ్మ ఎలాగూ అన్నం పెడుతుంది. ఏదో మా నాన్న కోరిక ధర్మమాని సర్టిఫికెట్లున్నాయి. బాగానే గడిచిపోతోంది. పద ఏదైనా పిట్టని పడదాం"

వాళ్ళ పక్కన చిన్న సందులోకి తిరిగారు సుబ్బారావు మనస్సు మనస్సులో లేదు. ఎవరికీ చెప్పుకోలేని బాధ. అసలే భార్యకి దానధర్మాలు గిట్టవు. ఇలా మోసపోయానని తెలిస్తే పది మందిలో పరువు తీసేస్తుంది. ఈ స్పాట్ వాల్యుయేషన్ అయ్యాక ఏమైనా చెయ్యాలి. అతనిలో ఆలోచనలు పరిపరివిధాలుగా పోయాయి.

స్పాట్ వాల్యుయేషన్ పూర్తయి ఊరు వెళ్లేసరికి ట్రాన్స్ఫర్ అవుతుందని ఉప్పందింది. అందరి కాళ్లూ పట్టుకుని ట్రాన్స్ఫర్ ఆపించుకునేసరికి రెండునెలలు పట్టింది. ఆ కష్టం తీరి మెల్లిగా సెటిలయ్యాక అతనికి ఆనందరావు జ్ఞాపకమొచ్చాడు. మార్కుల కాగితాలు, టి.సి చూపించాడు. కాండక్ట్ సర్టిఫికెట్ లేదేమిటి? ఎవ్వరూ చూడలేదు. ఎవరికీ అనుమానమూ రాలేదు. ఇంకెంతమందిని మోసం చేస్తున్నాడో? ఎలా ఆపడం? పోనీ కథ వ్రాస్తే? చదివిన కొందరికైనా డబ్బిచ్చేముందు కాండక్ట్ సర్టిఫికెట్ చూడాలని తెలుస్తుంది. కథలో మార్పులు చెయ్యాలి. లేకపోతే తనతో పేపర్లు దిద్దినవాళ్లకి అందరికీ తెలిసి వెక్కిరిస్తారు. ఇంజనీరింగుని మెడిసన్‌గా మార్చవచ్చు. ఇంకా చిన్న చిన్న మార్పులతో సుబ్బారావు కథ వ్రాసి ఒక తెలుగు వారపత్రికకు పంపాడు. అతని కథా వస్తువూ, శైలీ, రచనా ఎడిటర్‌ని ఎంతగానో ఆకర్షించాయి. సంక్రాంతి స్పెషల్ ఇష్యూలో అతని కథ ప్రచురితమైంది.

❖ ❖ ❖

ఆ కథ పల్లవి చదివి రవికాంత్‌కి చూపించింది.

"ఎవరో నాలాగానే మోసపోయాడన్న మాట" అన్నాడు రవికాంత్.

"పోనీలెండి. తెలుగు పాఠకులకు కూడా కనువిప్పవుతుంది. నాకెందుకో తెలుగులో వ్రాయాలని తోచలేదు"

"కాన్వెంటు పిల్లవి. నువ్వు తెలుగేం వ్రాస్తావు" పరాచికాలాడాడు రవికాంత్.

"పోనీలేండి. ఎవరో ఒకరు మంచిపనిచేసారు" అందామె.

తమ కథని కాఫీ కొట్టాడన్న ఊహ ఆ ఇద్దరికీ రాలేదు. మంచి మనసులకి మంచి ఊహాలే వస్తాయి.

కానీ కథ ప్రచురితమైన వారం తిరక్కుండగానే పత్రికాఫీసుకి కుప్పలుగా ఉత్తరాలొచ్చాయి. అంత పెద్ద పత్రికలో, అందునా స్పెషల్ ఇష్యూలో కథ పడిందంటే ఆ సంగతి ఎందరి హృదయాలలోనో అసూయని రేపుతుంది. రంధ్రాన్వేషణే జీవిత లక్ష్యంగా గల విమర్శకులు విజృంభించారు. ఆపత్రికలో తమ కథ ప్రచురితం కాని వర్ధమాన రచయితలూ రచయిత్రులూ ఇదే అదననుకున్నారు. ఫలానా నెలలోని, ఫలానా ఇంగ్లీషు పత్రికలో పల్లవీరవికాంత్ గారి కథకు ఇది మక్కికి మక్కీ అని ఉత్తరాలు వ్రాసారు శ్రీ సుబ్బారావు గారి గుండెధైర్యాన్ని మెచ్చుకోవాలన్నారు. సాహితీ చౌర్యం చేసే వాడికి చౌర్యం మీద కథ వ్రాసే హక్కు లేదన్నారు.

"కథ సొంతమని హామీ ఇచ్చారు. ఇప్పడేమంటారా"ని ఎడిటర్ నుండి సుబ్బారావుకి నోటీసు వచ్చింది.

సుబ్బారావు దిగాలుపడిపోయాడు. ఆకథ కాదు కదా ఇంగ్లీషు పత్రిక ఏ ఇష్యూ తానేనాడూ చదవలేదే. ఏమని రిప్లయ్ వ్రాయాలి! ఇది నిజంగా తన జీవితంలో జరిగిందని వ్రాయాలా?

వీధిలో విమర్శలు మరీ ఎక్కువయ్యాయి. కథ చదివి బావుందన్న వాళ్లు లేరుకానీ ఇప్పడు సుబ్బారావు కనబడ్డంచాలు పలకరిస్తున్నారు.

"ఏమయ్యా ఎంత కీర్తి కాంక్షయ్యా"

"కాపీ ఎందుకు చేశారండీ నన్నడిగితే మంచి థీమ్ ఇద్దునుకదా"

"ఏమండీ సుబ్బారావుగారూ, ఈసారి ఏ తమిళమో, కన్నడమో కాపీ కొట్టండి. బయటపడదు."

కష్ట సుఖాల్లో పాలు పంచుకోవాల్సిన కట్టుకున్న భార్యకూడా "ఏం పని చేసారండీ నలుగురిలో తలెత్తుకు తిరగలేకపోతున్నాను" అని విసుక్కుంది. కథ పడ్డ వెంటనే పత్రికతో నాలుగు వీధులూ తిరిగి అందరికీ చూపించిన సంగతి ఆమెకు జ్ఞాపకంలేదు.

సుబ్బారావు నీరసంగా కూచున్నాడు. ఒకే రకం సంఘటన ఇద్దరి జీవితాలలో జరిగి ఒకేలా స్పందింపజేసిందని ఒక్కరూ అనుకోరేమిటి? పెద్ద పెద్ద నేరాలకే కోర్టు బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇస్తుందే? తన విషయంలో ఎవ్వరూ - ఆఖరుకి భార్య కూడా అనుకోవడంలేదా? సాహితీ చౌర్యం. ఎంత మాట. తను దొంగల్లో లెక్కన్నమాట.

❖ ❖ ❖

అసలు దొంగ ఆనందరావు అయిదు నక్షత్రాల హోటల్లో హాయిగా మజా చేసుకుంటూనే వున్నాడు.

'ఆంధ్రభూమి' వీక్లీ